ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 19.11.2024 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమది మహిళలపక్షపాతి ప్రభుత్వమని అన్నారు. ఈ రోజు హన్మకొండలో కాళోజి కళాక్షేత్రాన్ని ప్రారంభించారు.
2. వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు ఈరోజు పోలీసుల ఎదుట లొంగిపోయాడు.
3. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వల్ల ఈ సీజన్ లో రాష్ట్రంలో వరి పంటపై ఎలాంటి ప్రభావం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ కొట్టిపారేసింది.
4. ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ "హమార శౌచాలయ్ - హమార సమ్మాన్" పేరుతో మూడు వారాల ప్రచారాన్ని ఈ రోజు లాంఛనంగా ప్రారంభించింది.

-----------------------

**KALOJI**

ప్రజాపాలన వేడుకల్లో భాగంగా హన్మకొండలో కాళోజి కళాక్షేత్రాన్ని ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 1969 ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసిన తర్వాతి దశాబ్దాలలో ఉద్యమాన్ని ప్రేరేపించిన పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, రాజకీయ కార్యకర్త కాళోజి నారాయణ రావు జ్ఞాపకార్థం ఈ కళాక్షేత్రాన్ని నిర్మించారు. ఈ సాంస్కృతిక కేంద్రంలో 1200 సీట్లతో కూడిన ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజాకవి కాళోజి కాంస్య విగ్రహాన్ని కూడ ఆవిష్కరించారు. అదే విధంగా జిల్లాలో 4600 పై చిలుకు కోట్ల

రూపాయలతో పలు అభివృద్ధి పనులకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేసి, జిల్లాలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాల్స్ ను కూడ సందర్శించారు.

----------------------------

**CM**

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమది మహిళలపక్షపాతి ప్రభుత్వమని అన్నారు. రాష్టంలో మరింత మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి లేరని,తమ ప్రభుత్వంలో వరంగల్ నుంచే ఇద్దరు మహిళా ముఖ్యమంత్రులు ఉన్నారని పేర్కొన్నారు. వరలంగల్ అభివృద్ధి చెందితే 50 శాతం తెలంగాణ అభివృద్ధి చెందినట్టేనని అన్నారు.

-------------------------

**EX-GRATIA**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి తొలిసారిగా జరుపుతున్న పర్యటన సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాట్లపై సమీక్షించారు. హెలికాప్టర్లో వేములవాడ చేరుకునీ ముఖ్యమంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఆలయ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం దేవాలయం సమీపంలో ఆయన ఒక బహిరంగ సభ లో మాట్లాడుతారు. 2023 డిసెంబర్ నుంచి మరణించిన 17మంది గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లింపుకి సంబంధించిన మంజూరు లేఖలను ముఖ్యమంత్రి అందజేస్తారు. ఎక్స్గ్రేషియా మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తారు.

--------------------

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. వేములవాడలో రేపు ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు.

--------------------------

లగచర్ల కేసు ప్రధాన నిందితుడు సురేష్ రాజ్ లొంగుబాటు.

వికారాబాద్ జిల్లా,దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో గత సోమవారం కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా A2గా ఉన్న బోగమోని సురేష్ రాజ్ ఈరోజు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కొడంగల్ కోర్టులో అతడిని పోలీసులు హాజరుపరిచారు. ఘటన జరిగిన నాటి నుంచి పరారీలో ఉన్న సురేష్ రాజ్ కోసం గత 9 రోజుల నుండి ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలించారు. సురేష్ రాజ్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. నిందితుడిని సంగారెడ్డి జైలు కు తరలించారు.

---------------------------------

**HC- PATNAM**

వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో నింధితుడైన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి, చర్లపల్లి జైలులో ప్రత్యేక బారక్ సదుపాయానికి తెలంగాణ హైకోర్టు అనుమతించింది. భద్రత పరమైన సమస్యలు, ఇతర కారణాలను పేర్కొంటూ తోటి ఖైదీల నుంచి దూరంగా ప్రత్యేక బారక్ ను కోరుతూ ఆయన తరపున దాఖలు చేసిన పిటిషన్ పై కోర్టు స్పందించి, బారక్ ఏర్పాటుకు జైలు అధికారులను ఆదేశించింది.

-------------------------

బీఆర్ఎస్ మహబూబాబాద్ మహాధర్నా

లగచెర్ల గ్రామంలో ఘటనను నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి (BRS) పార్టీ ఆద్వర్యంలో ఈ నెల 21 వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మహా ధర్నాలో పాల్గొనాలని శాసనమండలి సభ్యులు తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా స్థలిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ మహా ధర్నాకు BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు హాజరవుతారని తెలిపారు.

---------------------------

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

లగచర్లలో పెట్టిన ఫార్మా గ్రామ ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోవాలని జనగామ బిఆర్ ఎస్ పార్టీ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.గిరిజనులకు సంబంధించిన భూములను ఎట్టి పరిస్థితిలో తీసుకోవొద్దనే డిమాండ్ తో గిరిజనులు తలపెట్టిన ఛలో కొడంగల్ కార్యక్రమాన్ని భగ్నం చేసి అక్రమంగా అరెస్ట్ చేసిన గిరిజన బిడ్డలను వెంటనే విడిచిపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

----------------------------

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రుతో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్బంగా పలు ప్రజా సమస్యలను కలెక్టర్ తో ప్రభాకర్ ప్రస్తావించారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్య శ్రీ పథకం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదలు అధికంగా నివసించే బస్తీలలో కొత్తగా అంగన్ వాడీ కేంద్రాలను ప్రారంభించాలని, కేంద్ర ప్రభుత్వం

ప్రవేశపెట్టిన విశ్వ కర్మ యోజన పథకాన్ని జిల్లాలో అమలు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను ప్రభాకర్ కోరారు.

------------------------

**BRS**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వల్ల ఈ సీజన్ లో రాష్ట్రంలోని వరి పంటపై ఎలాంటి ప్రభావం లేదని ముఖ్యమంత్రి రేవంత్  రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ కొట్టిపారేసింది. KLIS కింద నిర్మించిన రెండు పంప్ హౌస్ లు నీటి పారుదల రంగానికి పెద్ద పీట వేశాయని, ఫలితంగా పంట విజయవంతమైందని బీఆర్ఎస్ నాయకులు ప్రముఖంగా  ప్రస్తావించారు. సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బి. వినోద్ కుమార్ ఈ రోజు విలేకరులతో మాట్లాడుతూ KLISలో అంతర్భాగమైన ఎల్లంపల్లి, మిడ్ మానేరు జలాశయాల్లోని పంప్ హౌస్ లు ఈ సీజన్ లో పంటకు నీటిని అందించడంలో క్రియాశీలక పాత్ర పోషించాయని చెప్తూ, ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహన లేమిని సూచిస్తున్నాయని విమర్శించారు.

------------------------

**GO16**

రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు సంబంధించిన సెక్షన్ 10 ఏ 16 నెంబర్ జీవో ను తెలంగాణ హైకోర్టు ఈరోజు కొట్టి వేసింది. హైకోర్టులో ఈ జీవోను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన నిరుద్యోగులు, నిబంధనలకు వ్యతిరేకంగా ఈ క్రమబద్ధీకరణ  జరిగిందని ఆరోపించారు. ఇటువంటి వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పును ఉటంకిస్తూ ఈ జీవో ఆ తీర్పు కు విరుద్ధంగా ఉందని. పిటిషనర్లు చెప్పారు కేసు విచారణకు చేపట్టిన హైకోర్టు ప్రభుత్వ చర్యలు చట్టబద్ధంగా లేవని అంటూ జీవోని కొట్టివేసింది. BRS ప్రభుత్వం అంతకుముందు ఆరోగ్య, విద్యా శాఖలలో 5544 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరిస్తూ ఈ జీవో జారీ చేసింది.

-----------------------------

**JAL SHAKTI**

ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ "హమార శౌచాలయ్ - హమార సమ్మాన్" పేరుతో మూడు వారాల పాటు ప్రచారాన్ని ఈరోజు ప్రారంభించింది. ఇందులో భాగంగా పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రవర్తనా మార్పులను పెంపొందించడం, దేశవ్యాప్తంగా మరుగుదొడ్ల పనితీరు, నిర్వహణను మెరుగుపరచడం వంటివి ఈ ప్రచార ప్రధాన లక్ష్యం. ఈ ప్రచారంలో భాగంగా పలు పోటీలను నిర్వహించనున్నారు. కాగా వచ్చే నెల 10వ తేదీ జాతీయ మానవ హక్కుల దినోత్సవం రోజున ఈ ప్రచారం ముగుస్తుంది.

----------------------------

**WANAPARTHY**

ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ కళాకారులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేటి నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆధర్శ్ సురభి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సంబంధాల అధికారి ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రను జెండా ఊపీ ప్రారంభించారు.

------------------------------

పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోలు

పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 1503 మంది రైతుల నుండి లక్ష 18 వేల 260 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి 5 కోట్ల 91 లక్షల 30 వేల 600 రూపాయల బోనస్ చెల్లించామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో అన్నారు. నవంబర్ 14

నుంచి నిన్నటి వరకు మొత్తం 1503 రైతుల నుంచి లక్ష 18 వేల పై చిలుకు క్వింటాళ్ల సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి 5 కోట్ల 91 లక్షల రూపాయల పై చిలుకు బోనస్ చెల్లించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

-------------------------

**NITI AIM**

కమ్యూనిటి ఇన్నోవేటర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ లో భాగంగా నీతి ఆయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఈ రోజు న్యూఢిల్లీలో 15 మంది సభ్యులను సత్కరించింది. ఈ కార్యక్రమం సమాజంలోని సవాళ్లను పరిష్కరించడానికి విభిన్న నేపథ్యాల నుంచి వచ్చే ఔత్సాహిక ఆవిష్కర్తలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా సభ్యుల ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి నీతి ఆయోగ్ లక్ష రూపాయల అధనపు నిధులను మంజూరు చేసింది. అటల్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ ఆకాశవాణితో మాట్లాడుతూ... ఇంక్యూబేటర్ల లభ్యతలో ప్రాంతీయ అసమానతల వంటి ముఖ్యమైన సవాళ్లను పరిష్కరించడం ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు.

---------------------------